ఇలా నిర్ణయించి ఆ దినాన్ని తప్పనిసరిగా బంద్ దినంగా ప్రకటిస్తే ఎవరి జాగ్రత్తమీద వారు ఉంటారు - అని, ఆ ప్రతిపాదన.''

"దానికి మీరందరూ ఒప్పేసుకోవచ్చుననుకుంటాను. మీక్కావలసింది బంద్‌లు, అలా నిర్ణయమైన రోజున మీపార్టీ కారణం మీది, ఇంకో పార్టీ కారణం వాళ్లది. ప్రజలందరూ అదొక సెలవుదినంగా పరిగణించుకుని, ఇళ్లల్లో కూర్చుంటారు, హాయిగా.''

"గొప్ప గడుసుతనమే, మేం బంద్‌లు నిర్వహించడం - ప్రజలు హాయిగా ఉండడానికి కాదు. ప్రజల్ని ఎలాగో ఓలాగ కాల్చుకు తినాలని కదా! మీరు ఇలాటి సలహాలు చెప్తారని తెలియక ఏదో పెద్దవారు కదా అని జీపు ఎక్కమన్నాను. దిగండి!'' అని జీపు ఆపాడు శివనాథం.

ఆవిధంగా, ఇంటికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో చిక్కడిపోయాను. ★

# 46. మరిచిపోయే కథ

ఒకసారి నేను హైదరాబాదు నుంచి విశాఖపట్నం ఒద్దామని గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి టిక్కెట్టు కొనుక్కుని రిజర్వేషన్ చేయించుకుని రైలెక్కేను. ఒక చిన్న బ్రీఫ్‌కేసు ఒక చేత్తోనూ, కాలుతూ వున్న సిగరెట్టు రెండో చేత్తోను పట్టుకుని, "చిన్న శాస్త్రి'' అని మేమంతా పిల్చుకునే గుంటూరు సుబ్రహ్మణ్యశాస్త్రి సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆ రైలెక్కేడు. తనకి కిటికీ దగ్గిర సీటూ కింది బెర్తూ రిజర్వేషన్ అయ్యేయి. ఐనా కిటికీ దగ్గిర అంతకి ముందునుంచీ కూర్చున్న ఒకానొక స్ఫురద్రూపికి ఆ కిటికీ సుఖం వదిలేసి, మా చిన్న శాస్త్రి బెర్తు మధ్యని ఎడ్జస్టయ్యేడు. అయితే ఆ స్ఫురద్రూపి గారు ఎడ్జస్టు అవలేదు. సిగరెట్టు అయిపోగానే పారేడానికి చిన్నశాస్త్రి ఆయన మీదుగా కిటికీలోంచి వంగినపుడు "ఎక్సూజ్ మీ, మీరు స్మోక్ చేస్తారు గాబోలు; ఈ చివర కూర్చోండి'' అని లేచిపోయి, తనకి రిజర్వేషన్ ఇచ్చిన మధ్యసీటుకి మారిపోయాడు.

ఓ అరగంట కబుర్లు చెప్పుకున్నాక కాఫీ అబ్బాయి ఒస్తేను, నేను: నాకూ చిన్నశాస్త్రికీ రెండిమ్మన్నాను. శాస్త్రి "మూడు'' అన్చెప్పి ఆ స్ఫురద్రూపి గారిక్కూడా ఓ కప్పు ఇప్పించేడు.

ఆయన శాస్త్రికి థాంక్స్ చెప్పి కాఫీ తాగేశాడు. (మూడు కాఫీలకీ డబ్బులు నేనే ఇచ్చాను; అది వేరే సంగతి!)

కాఫీ తాగ్గానే చిన్న శాస్త్రి మళ్లీ సిగరెట్టు వెలిగించేడు. ఆ స్ఫురద్రూపి శాస్త్రితో "కాఫీ సిగరెట్టుకి మంచి బేస్'' అన్నాడు నవ్వుతూ. "కిళ్ళీకి భోజనంలాగా?'' అని నేను మాట కలపబోయాను. వాళ్లిద్దరూ వినిపించుకోలేదు. "మీరు కూడా ఒకటి కాల్చండి!'' అని చిన్న శాస్త్రి అతనికెదురుగా తన సిగరెట్ పెట్టె తెరచి, ఒక సిగరెట్టుని సహం మేరకు లాగి అతని మీదికి తుపాకీలా గురిపెట్టాడు. "థాంక్యూ'' అని అతను సిగరెట్టు అందుకుని, పెదిమల్లో బిగించి, ప్యాంటు జేబులో చెయ్యి పెట్టేడు. చిన్న శాస్త్రి తన రెండో చేతిలో సిద్ధంగా వున్న అగ్గిపెట్టె లకలక లాడిస్తూ అందించబోయాడు. కాని, ఆ స్ఫురద్రూపి చిరునవ్వుతో "అగ్గిపెట్టె మేంటేన్ చేస్తున్నాలెండి!'' అని చెప్పి తన స్వంత పెదవుల మధ్య ఉన్న పరాయి సిగరెట్టుని స్వంత అగ్గిపెట్టెతోనే వెలిగించుకున్నాడు.

రెండు 'థాంక్యూలు' చెప్పి కాఫీ సిగరెట్టూ సంపాదించేసేడే అని అతని ప్రతిభను నేను లోలోపల మెచ్చుకున్నాను. చిన్న శాస్త్రి అతనితో సిగరెట్టు-రికం కలిపేశాడు.(చుట్ట ద్వారా స్నేహాలు కలుపుకుంటే అది చుట్టరికం అయినట్టే సిగరెట్ ద్వారా స్నేహాలు కలుపుకుంటే సిగరెట్టురికం అని తాత్పర్యం) అలా అలా చిన్న శాస్త్రి అతన్ని కబుర్లలోకి దింపేడు. చివరికి తేల్చింది ఇదీ:- "మీకూ నాకూ శాంతారాం అని కామన్ ఫ్రెండొకాయన ఉన్నాడు కదా. మనం ముగ్గురం 1978లో ఒక బార్‌లో తొలిసారి కలుసుకున్నాం. అప్పుడు మీరు సిగరెట్లు ఎక్కువగా కాల్చేవారు. ఇప్పుడు మానీసినట్టున్నారు?"

"మానేసిన మాట నిజమే గాని; కొనడం మాత్రమే మానేశాను!" అని ఆయన నవ్వేడు ఆ విధంగా రెండు థాంక్యూలకి ఒక జోక్ బోనస్ వచ్చింది.

★★★

1985లో నేను నడ్డినొప్పికి చికిత్స చేయించుకుందికని నెపం పెట్టి చిన్నిల్లు లాంటి ఓ రెండో వుద్యోగం చేసుకుంటూ ఐదు నెలలు మద్రాసులో ఉన్నాను. ఆ రోజుల్లో ఒకనాడు విశాఖపట్నం రావాలని సెంట్రల్ స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ దగ్గిర క్యూలో ఉన్నాను. నాకు క్యూలో నెంబరు వన్ పొజిషన్ వచ్చిన సమయానికి అదే క్యూలో ఎనిమిదో స్థానంలో ఉన్న ఒక కుర్రాడు నా దగ్గిరకొచ్చి "సార్, సార్! పెన్‌సార్! జస్ట్ టూ మినిట్స్ సార్!" అని అడిగాడు.

"ఒద్దయ్యా బాబూ, నాకు మతి మరుపు ఎక్కువ. నా టిక్కెట్ అయిపోయిన అడావిడిలో నా పెన్ నీ దగ్గరుందన్న సంగతి మర్చిపోయి వెళిపోతే సంకు పాపారావు జోకు పడిపోతుంది." అన్నా సరే అతను వదల్లేదు.

అతను రిజర్వేషన్ దరఖాస్తు ఫిలప్ చేస్తూనే ఉన్నాడు; నా టిక్కెట్ విషయంలో రిజర్వేషన్ క్లర్క్ నాకు కింద బెర్తు ఇవ్వాలా మీద బెర్తు ఇవ్వొచ్చునా అని నన్ను కిందా మీదా పెడుతూనే ఉన్నాడు. ఈ గాభరాలో నా పెన్ అతగాడి దగ్గిర వుందన్న సంగతి నిజంగానే మరిచిపోయి నా టిక్కెట్ పుచ్చుకుని నేనివతలికొచ్చేసేను. ఇంటికొచ్చి చూసుకున్నాను. సంకు పాపారావు జోకు గుర్తొచ్చింది. పెన్నులేని రచయిత గన్నులేని సోల్జర్ లాటోడు. కాని; వెంటనే రాయలేక వాయిదావేసేను.

ఇంకో రోజున నేను తేనాంపేట వెళ్లాలని వడపళని బస్టాపులో నుంచున్నాను. పది నిమిషాలు విసుక్కుంటూ నుంచుంటే గాని 12-బి. రాలేదు. ఒచ్చిన బస్సులోకి తోసుకుంటూ ఎక్కిన వాళ్లలో నేనే చివరివాణ్ణి. ఐతే బస్ స్టార్టయి పది గజాలు నడిచిందో లేదో; "అల్లో, పెరియవరో!" అని ఒక ఆక్రందన. వెంటనే, పరిగెడుతున్న ఆ బస్సులోకి అంతకంటే స్పీడుగా పరిగెడుతూ ఒకబ్బాయి ఎక్కడం!

"మిమ్మల్నే" అన్నాడా అబ్బాయి; నా జబ్బ పట్టుకుని.

నన్నేనట; పెద్దాయనా అని అతను పిలిచింది.

"మీరెవరో నాకు తెలియలేదు" అన్నాను.

"16 రోజుల కిందట సెంట్రల్ స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ దగ్గిర మీ పెన్ నాకు ఎరువిచ్చారు. అప్పట్నుంచీ మీ కోసం వెతుకుతున్నాను. మీరు అనుకున్నట్టుగానే మీ పెన్ నా

దగ్గిర మరచిపోయారు. ఇదిగో!'' అని నా పెన్ నాకిచ్చేశాడు.

"మరి అంతసేపు బస్టాపులో నిలబడ్డావే, అప్పుడే ఇచ్చీలేకపోయావా? పరిగెట్టుకుంటూ వచ్చేవు పాపం! పడిపోతే ఎంత డేంజరు!'' అన్నాను. (ప్రమాదం అనకూడదు. ప్రమాదం అంటే అరవంలో అద్భుతం అని అర్థం. అందుకని డేంజరు అన్నాను.)

'నేను 17 కోసం నిలబడ్డాను. సెంట్రల్ స్టేషన్ కెళ్లాలి'' అన్నాడతను. నేను అతని జేబు వేపు చూసేను. మళ్లీ ఇప్పుడు కూడా పెన్ లేదు.

"ఎందుకూ, ఇది వుంచేసుకో'' అన్నాను. నా మనస్సెంతో బాధపడింది. పాపం ఇతను కేవలం పెన్ సంపాదించడంకోసం మళ్లీ దేముడా అని సెంట్రల్ స్టేషన్ దాకా వెళిపోతాడు కాబోలని.

★★★

ఒకసారి నేను డ్యూటీ మీద ఢిల్లీ వెళ్ళినప్పుడు ఫస్టు క్లాసులో ప్రయాణం చేసే భాగ్యం కలిగింది. రెండే బెర్తులున్న "జి" అనే ఆ క్యాబిన్‌లో భిలాయిలో ఒకాయన దిగడం, ఇంచుమించు నలభయ్యేళ్లున్న ఒక భద్ర మహిళ ఎక్కడం జరిగింది.

ఆవిడ, ఆ రైలు నాగపూర్ వెళ్లేలోగా రైలు ఆగిన దగ్గిరల్లా ఏదో ఒకటి కొంటూనే వుంది. రాజనందిగాంలో టీ చెప్పి, పుచ్చుకుని తాగేసింది. టీ కుర్రాడికి ఇరవై రూపాయల నోటు చూపించింది. వాడేమో చిల్లర లేదన్నాడు. 19రూపాయలు పట్టుకొచ్చిస్తే ఈ కప్పూ ఈ నోటూ ఇస్తానంది. బండి వెళిపోతుందమ్మగారూ-అంటూ ఆ కుర్రాడు నెత్తీనోరూ మొత్తుకున్నాడు.

"నీ నాటకాలు నా దగ్గిరా?'' అందీవిడ. చివరికి నేనే ఆ కుర్రాడి చేతిలో ఒక రూపాయి పెట్టి కప్పు పట్టుకు పొమ్మన్నాను.

గోండియాలో ఆవిడ కమలాపళ్లు కొన్నప్పుడు రెండు రూపాయలన్నర నేనే ఇచ్చాను. ఇలాగే తుమ్సార్‌లో పువ్వులు కొన్నప్పుడయితేనేం, కాంప్టీలో అదేదో స్వీటు లాంటిది కొన్నప్పుడైతేనేం, ఆవిడ 20 రూపాయల నోటు చూపించడం, ఎవరికి వారే దాన్ని చూసి బెదిరిపోడం, ఆ అప్రదిష్టకి నేను భయపడ్డం అయి, ఆవిడ "చిల్లర అవసరాలు'' తీరుస్తూ కూచున్నాను.

నాగపూర్లోనో, భోపాల్లోనో, కనీసం ఆగ్రాలోనో ఆ 20 నోటు మార్చి నా బాకీ తీర్చేస్తుందనే అనుకున్నాను. రైలు నాగపూర్‌కి చేరేసరికి టైము ఎనిమిదిన్నరే అయిందిగాని ఆవిడ బిల్లు తొమ్మిదిన్నర అయింది. కానీ నేను ఆ తెల్లవారి లేచి చూస్తే ఆవిడ కనిపించలేదు. బెర్తుకింద ఉన్న నా బాస్కెట్‌లో హిందీ భాషలో ఒక చీటివుంది. నాకు హిందీ రాదు గానీ అది ఆవిడ నాకు రాసిన చీటీయే అని జాగర్తచేసి ఢిల్లీలో గెస్టుహౌసులో దిగేక అక్కడ గోపీ అనే హిందీ, తెలుగు తెలిసిన దుబాసీ వంట వాడుంటేను, ఆ చీటి అతని కిచ్చి చదివి అర్థం చెప్పమన్నాను. వాడు ఒకటే నవ్వడం, బలే టోపీలో పడ్డారు సార్ అని!

సరే; దమ్మున్నంతసేపు నవ్వేక ఆ చీటిముక్కకి ముక్కస్య ముక్కార్థం ఇలా చెప్పేడు; 'జంటిల్‌మన్! మీకు నేను రైలు ప్రయాణంలో నైన్ ఫిఫ్టీ బాకీ పడ్డాను. సారీ. నేను దిగిపోయే టైమ్‌కి మీరు మంచి నిద్దట్లో వున్నారు. అందుచేత మీ బాస్కెట్‌లో ఉన్న మీ చిల్లర పర్స్ తీసి

చూసేను. అందులో టెన్ ఫిఫ్టీ (పది రూపాయలన్నర) ఉంటే నా 20 నోటు అందులో వుంచేసి ఆ టెన్ ఫిఫ్టీ పట్టుకుపోదామనుకున్నాను. కానీ అందులో ఫోర్‌ఫిఫ్టీయే వుంది. సో; పోర్టరుకీ, రిక్షాటేక్సీకీ ఇవ్వడానికి ఉంటుంది కదా ని ఆ ఛేంజి తీసుకున్నాను. టోటలు ఫోర్టీన్ రుపీస్ అయింది. మీ పేరూ, వూరు చెప్పేరు కాని నేను రాసుకోనందువల్ల మర్చిపోయాను. నా అడ్రస్ ఇక్కడ వ్రాయడమయినది. మీరు మీ స్వస్థానం చేరేక మీ అడ్రస్ ఇస్తూ ఒక లెటర్ వ్రాయండి, మీ ఫోర్టీన్ రుపీసూ థేంక్స్‌తో సహా రిటన్ చేసేస్తాను!' ఎప్పటికప్పుడు ఆ ఉత్తరం రాయాలను కుంటూనే మర్చిపోతూ ఉంటాను!

★★★

ఇంకోసారి నేను విశాఖపట్నం నించి హైదరాబాద్ వెళ్తున్నప్పుడు నా ఎదుటి బెర్తులో ఉన్న ఒకాయనతో పరిచయం అయింది. ఏ వూరు వెళ్తున్నారు, ఏం పని; అసలు మీది హైదరాబాదా విశాఖపట్నమా, ఇలాంటి ప్రశ్నలన్నీ అయిపోయాక మా ఇద్దరి మధ్యా బోలెడు ఆత్మీయత పెరిగిపోయింది. ఇహ అక్కణ్ణించి రాజకీయాల మీద, సినిమాల మీద, ఆఖరికి రిజర్వేషన్ల మీద కూడా మేం మనస్సులు విప్పేసి మాట్లాడేసుకున్నాం. రిజర్వేషన్లంటే రైళ్లలో బెర్తు రిజర్వేషన్లు కాదు; ఉద్యోగాల్లో కులాల వారీ రిజర్వేషన్లన్నమాట! నేనేం మాట్లాడితే అతనేమనుకుంటాడో అన్న భయం నాకూ పోయింది. తనేం మాట్లాడితే నేనెక్కడ పేపర్లలో రాసి ఏకేస్తానేమో అన్న భయం అతనికీ పోయినట్టుంది.

ఇహ ఎడ్రసులు ఇచ్చిపుచ్చుకోవడం, పిల్లలకి సంబంధాలు వెతకడంలో ఒకళ్లసాయం ఉంకోళ్లు తీసుకుందామనుకోడం - ఇలాంటివి మాత్రం బాకీ. ఆ కబుర్లలో మాకిద్దరికీ తెలీకుండా సామర్లకోట స్టేషనొచ్చింది. అతను రైల్వే కేటరింగ్ వాళ్లు సరఫరా చేసే ప్లేటు భోజనం తెప్పించుకుని తిన్నాడు. అంతా అయ్యేక "మీ బాస్కెట్‌లో మంచినీళ్ళున్నట్టున్నాయి; తీసుకుంటాను" అని స్వతంత్రంగా నా సీసా, గ్లాసూ బైటికి లాగి తన దాహం తీర్చేసుకున్నాడు.

"మీకు ప్రయాణాల్లో మంచినీళ్ల సీసా తెచ్చుకునే అలవాటు లేదా?" అన్నాను.

"అవన్నీ మోసేటంత చాదస్తుణ్ణి కాదండోయ్" అని నవ్వేడతను.

"ఏమో సుమండి. మీ లాంటి వాళ్లు చేదస్తం అని చీదరించుకున్నాసరే; నేను మాత్రం విధిగా మంచినీళ్ల సీసా, గ్లాసూ తెచ్చుకుంటూనే ఉన్నాను!" అని నేనూ నవ్వేను.

రైలు రాజమండ్రీ వదిలేక నాకు ఆకలేసింది. కేరీరు గిన్నె తెరచి తినడం మొదలెట్టాను.

రెండు ముద్దలు తినేసరికి కారం నోరు పట్టక నీళ్ళు తాగాలని సీసా తీసాను. అందులో రెండంటే రెండు గుక్కల నీళ్లు మాత్రం ఉన్నాయి. ఇంకా కావాలంటే కిందని గోదావరి నది ప్రవహిస్తోంది. కాని, గొలుసు లాగి రైలు ఆపాలి. సీసాకి తాడుకట్టి కిందకి వదలాలి; అదినిండిందని తెలిసేకే రైలుకి రైట్‌రైట్ అని చెప్పాలి. ఇవన్నీ అయ్యేపన్లు కావని గ్రహించి ఆ రెండు గుక్కల నీళ్లతోనే సరిపెట్టుకున్నాను. ఈ ఇబ్బంది అంతటికీ నువ్వే కారణం అన్న ఆరోపణ కళ్లలోకి తెచ్చుకుని అతని వేపు ఐదారుసార్లు చూసేక అతనికేదో వెలిగినట్టుంది.

"అయ్యో, మీకు మంచినీళ్లు చాల్లేదులా వుంది. కొవ్వూర్లో బండి ఆగనీండి! సీసా పట్టుకెళ్లి

నింపి తెస్తాను'' అన్నాడతను.

కొవ్వూర్లో బండి ఆగలేదు, నిడదవోల్లో ఆగింది గాని; అతని ఫ్రెండెవరో పరిగెట్టుకుంటూ అతని కిటికీ దగ్గరికొచ్చి "అలో, నారాయణమూర్తి, బావున్నావా? నువ్వీ బండిలో హైద్రాబాదు వెళ్తున్నావని వెంకట్రావు ఫోన్ చేసి చెప్పేడు-"అంటూ ఆప్యాయంగా మాట్లాడ్డం మొదలెట్టేసరికి అతనికి నా దాహం తీరిపోయినట్టుంది; మరి అతను లేచి వెళ్లలేదు. తాడేపల్లిగూడానికి కొంచెం యివతల అతను నిద్రకి ఉపక్రమించేడు. అంతే.

★★★

మొన్న పన్నెండో తారీఖు నాడు కార్డులు కొందామని పెద్ద పోస్టాఫీసుకి వెళ్లేను. కార్డులు అమ్మే కౌంటర్లో ఎలాగా చిల్లర లేదంటారు కదా అని ఏకంగా 20 కార్డులు కొనీసేను; మూడు రూపాయలు అమర్చుకుని, 20 కార్డులు కొనీసేను కదా ఒక్కటంటే ఒక్కటి నా ఒక్కగానొక్క చెల్లెలికి రాసేద్దామని ఒక్క కుర్చీ కాళీగా ఉంటే కూచుని ఒక్కలైను రాసేనో లేదో; నా వెనకాల ఒకతను తయారయ్యేడు. వెనక్కి తిరిగి చూసేను. ఒక్క ఇన్లాండు కవరు రెపరెపలాడిస్తూ

"ఒక్కసారి మీ పెన్ను-'' అన్నాడు.

నేను వెంటనే లేచి నిలబడి, "మీకొక్క జోకు చెప్పనా?'' అన్నాను.

"చెప్పండి, చెప్పండి'' అన్నాడతను నా నవ్వులో నవ్వు కలిపి.

"ఒకబ్బాయున్నాట్ట. అతను వాళ్ల ఇంటిదగ్గిర వీధి గుమ్మంలో నిలబడుంటేనూ, అల్లంత దూరాన్నించీ అతని గర్ల్ ఫ్రెండు ఒస్తూ కనిపించిందిట. ఆ అమ్మాయిని సాయంకాలం ఫలానా సినిమాహాలు దగ్గిరికి రమ్మని చీటి రాసి ఉండలా చుట్టి ఆ అమ్మాయి నడిచే దార్లో వెయ్యాలనిపించింది ఆ అబ్బాయికి. కానీ జేబులో చూసుకుంటే కాయితం వుంది గాని పెన్ లేదుట. పోనీ ఇంట్లో కెళ్లి తెచ్చుకోడానికయినా టైమ్ లేదుట. ఐనా, ఆ అబ్బాయి తను అనుకున్న విధంగా చీటీ రాసే గలిగాడుట. ఎలా రాసేడంటారు?'' అన్నాను.

"తెలీదే'' అన్నాడు ఆ పెన్నార్తుడు.

"ఓస్, ఈ మాత్రం తెలీదా? ఆ అబ్బాయి ఆ చీటి పెన్సిల్‌తో రాసేడూ!'' అన్నాను. "అంచేత మీరు పెన్ తెచ్చుకోడం మర్చిపోయినా పెన్సిల్ తెచ్చుకోవల్సింది!''

అతను సడెన్‌గా నా భుజం పట్టుకుని నన్ను పూర్తిగా తనవేపుకి తిప్పుకున్నాడు. "మిష్టర్! పెన్ ఇస్తే ఇవ్వండి, లేకపోతే మీ పెన్ పుచ్చుకుని వూరేగండి. అంతేగాని ఇలాంటి కుళ్లుజోకులు వెయ్యకండి'' అని అరిచి, అప్పుడే కొన్న ఆ ఫెళఫెళలాడే ఇన్లాండు కవర్ని రూపాయి నోటంత మడతకింద చేసేసి జేబులో పెట్టేసుకుని చెకాచెకా నడిచి వెళ్ళిపోయాడు. నేనివ్వకపోతే పోనీ ఇంకెవర్నయినా అడగొచ్చుకదా! ఊఁ హుఁ, అభిజాత్యం అడ్డొచ్చేసుంటుంది....లేక అలా రోడ్డు మీద్దాకా వెళ్లి తెగించి ఓ రూపాయి పెట్టి బాల్‌పాయింట్ పెన్ కొనుక్కొస్తాడో ఏమో; మరి తెలీలేదు.

ఇంతలోకి జనంలోంచి ఇద్దరు ముగ్గురు నా దగ్గరగా వచ్చి "ఏంటి, ఏంటి- ఏం జరిగింది''? అని అందోళన వ్యక్తపరిచేరు.

"ఏముందీ, నీ దగ్గిర ఏదో కంపు కొడుతోందయ్యా అన్నాను. ఇందాక మరుగుదొడ్డికి

వెళ్తూ చెంబుతో నీళ్లు పట్టిగెళ్లడం మర్చిపోయేట్ట. నేను కంపు అన్నానని నామీద కోప్పడి వెళ్లాడు. ఎవరి కంపు వారి కింపు కదా!'' అని చెప్పి నేను కూడా ఇవతలికి వచ్చేశాను.

★★★

ఇలాగ -

జేబులో పెన్ పెట్టుకోకపోయినా ఏదైనా రాసేడానికి సిద్ధపడిపోయే వాళ్లూ, డబ్బు పారేస్తే కొండమీది కోతినైనా కొనెయ్యొచ్చన్న ధీమాతో వేలకి వేల కిలోమీటర్ల ప్రయాణాల్లో కూడా గుక్కెడు నీళ్లూ రూపాయి చిల్లరా తెచ్చుకోని వాళ్లూ -

పది రూపాయలిచ్చి కింగుసైజు ఫిల్టరు సిగరెట్టు పెట్టె కొనీకూడా పావలా పెట్టి అగ్గిపెట్టి కొనడం మర్చిపోయేవాళ్లూ......

ఊళ్లో ఉన్నా కేంపుల్లో ఉన్నా నాకు కనబడుతూనే ఉన్నారు.

మీకూ కనబడుతూనే ఉన్నారా?

అయితే ఇది మరచిపోయే కథే.

★

# 47. శబ్దా భక్తులు

"సార్ ఉన్నారూ, అమ్మా?'' అని అడిగిన మనిషికి మా ఆవిడ "ఆ; ఉన్నారు. ఎవర్నువ్వు?'' అని సమాధానం చెప్పి ప్రశ్న వెయ్యడంతో నేను రాసుకుంటున్నది ఆపి, లేచి వీధి గుమ్మం దగ్గరికొచ్చేను. అక్కడ దీనంగా నిలబడి ఉన్నవాడు "మదార్‌సాహెబు''. రెండేళ్ల కిందట అనంతరామయ్య ఆఫీసులో పనిచేస్తూ ఉండేవాడు.

"సలాం ఆలేకుంసార్'' అన్నాడు నన్ను చూడగానే మొహంలోకి కాంతి తెచ్చుకుని .

అతను మాట్లాడినది యధాతథంగా చెప్పలేను గాని సారాంశం మాత్రం ఇది:- మా ఇంటికి అర ఫర్లాంగ్ దూరంలో కొత్తగా వెలసిన "టెంపుల్ కాంప్లెక్స్'' (దేవాలయ సముదాయం) లో ఆ రోజునుంచి మొదలెట్టి తొమ్మిది రోజులపాటు పూజలు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. వాటికి తాను తెచ్చిన మైక్ మరియు లౌడ్ స్పీకర్లు ఉపయోగిస్తున్నారు. ఆ రాత్రి, (మరియు తరువాత రాబోయే ఎనిమిది రాత్రులు) పదకొండు గంటలు దాటాక ఆ సరంజామా అంతా మా ఇంట్లో జాగర్త పెట్టి మళ్లా తెల్లవారుజామున నాలుగున్నరకి పట్టుకుపోనివ్వాలి. దేవాలయ సముదాయంలో ఆ ఖరీదైన మైక్‌సెట్లు లవుడు స్పీకర్లు జాగర్త పెట్టడానికి ఏర్పాటు లేదుట. పోనీ ఇంటికి పట్టుకుపోయి తెల్లారుజామున తీసుకురావాలంటే బోలెడు దూరం మూలాన్నించి రిక్షా కర్చులు తడిపిమోపెడు అవుతాయట. తెలిసిన వాళ్లెవరయినా దొరుకుతారా అని వెదుకుతూ వుంటే నా పేరుగల సైన్‌బోర్డు మా ఇంటి కాంపౌండ్ గోడకి కొట్టి వుందిట.

"ఐతే - ఉదయం నుంచి చెవులు ఘల్లడిపోయేటట్టు సౌండ్ పెట్టి న్యూసెన్సు చేస్తున్నది నువ్వా నాయనా!'' అంటూ మా ఆవిడ, "మా ఇంట్లో భోజనం యంతమాత్రం వీలు పడదు'' అన్న అగ్నిహోత్రావధానుల్లా మొహం పెట్టి ఇంట్లో కెళ్లిపోయింది.